# ప్రభురాత్రి భోజనము ఆత్మతో, సత్యముతో

క్రీస్తు ప్రభువు మాటలనుబట్టి, దేవునికి సమర్పింపబడే ఆరాధనకు రెండు యోగ్యతలు ఉండాలి. అది ఆత్మతో జరగాలి, అది సత్యంతో జరగాలి. సత్యంతో జరగాలన్నదేదైనా, సత్యమునను సరించియే జరగాలి, లేక దేవుని వాక్యం ప్రకారం జరగాలి (యోహాను 17:17). "ఆత్మతో" అంటే, తగిన స్వభావముతో లేక మానసిక పరిస్థితిలో అని భావం. ఈ సూత్రాలు – సరియైన కార్యము, సరియైన విధంగా జరిగించడం అనేవి ఆరాధనలోని ప్రతి కార్యానికి వర్తించాలి. ఏదియెలాగున్నా, ఈ పాఠంలో వీటిని ఆరాధనలోని ఒక భాగానికి: ప్రభురాత్రి భోజనానికి ప్రత్యేకంగా వర్తింప చేద్దాం.

## సత్యముతో

ప్రభురాత్రి భోజనం చేయడాన్ని గూర్చి దేవుని వాక్యం ఏమి బోధిస్తుంది?

మొదటిగా, ప్రభురాత్రి భోజనం చేయాలని అది బోధిస్తుంది. ఆత్మ సంబంధమైన ఈ విందులోని ప్రాముఖ్యత ప్రభువుచే అది ఆజ్ఞాపింపబడిందనే వాస్తవమునందు గోచరిస్తుంది (మత్తయి 26:26-29; మార్కు 14:22-25; లూకా 22:14-20). అది ఆయన మనస్సులో కలిగింది. ప్రాముఖ్యంకానిది, అగణ్యమైనది ఏదియు ఆయన మనస్సులో పుట్టలేదు. ప్రభువైన యేసు ఆరోహణమైన తరువాతనే అపొస్తలుడుగా ఎన్నిక చేయబడ్డ పౌలు సహితము ప్రభురాత్రి భోజనాన్ని గూర్చిన ఆజ్ఞను పొందాడు (1 కొరింథీ. 11). అది క్రైస్తవులు దానిని భుజించినది వాస్తవమని లూకా రికార్డు చేశాడు (అపొ. 2:42; 20:7). దేవుని ప్రేమించడమంటే, ఆయన ఆజ్ఞలను గైకొనడమే (1 యోహాను 5:3). ప్రభురాత్రి భోజనాన్ని చేయనివాడు దేవుని ప్రేమించుతున్నట్టు చెప్పుకోగలడా? దానిలో పాలుపుచ్చుకొనకుండ ఒకడు దేవునికి విధేయుడైయుండగలడా? నమ్మదగిన క్రైస్తవుడై ఉండాలంటే, ఒకడు ప్రభురాత్రి భోజనంలో పాలుపొందువాడై ఉండాలి.

రెండవది, ప్రభురాత్రి భోజనంలో పాలుపొందేవాడు యోగ్యతకలిగి పాలుపొందువాడై యుండాలి. అంగీకారయోగ్యంగా ప్రతి ఒక్కడు ప్రభురాత్రి భోజనాన్ని చేయలేడు. దానికి మనం తగినవారమైయుండాలి. దానిని ఎవరు భుజించగలరు? ఆ బల్లను తన రాజ్యములో నిలుపుతానని ప్రభువు వాగ్దానం చేశాడు (లూకా 22:29, 30). నమ్మకస్థులైన రాజ్యపు పౌరులు మాత్రమే దానిని భుజించడానికి హక్కుగలవారైయుంటారు అనేది వాగ్దానాన్ని

వెంబడించింది. ఆ రాజ్యంలోనికి ప్రవేశించాలంటే ఒకడు మార్పు పొందాలి; మరొక లేఖన భాగంలో చెప్పబడినట్టు అతడు తిరిగి జన్మించాలి (మత్తయి 18:5; యోహాను 3:3–5). క్రొత్త నిబంధనలో మార్పుపొందే చట్టం స్పష్టంగా యివ్వబడింది (మత్తయి 28:19, 20; మార్కు 16:15, 16; లూకా 24:46, 47; అపొ. 2:38). ఒకవ్యక్తి ఈ షరత్తులకు లోబడినప్పుడు, అతడు మార్పునొందాడు, తిరిగి జన్మించాడు, అందువలన తాను రాజ్య పౌరుడయ్యాడు. రాజ్యములోని ఆధిక్యతలను రాజ్య పౌరులు మాత్రమే కలిగియుంటారు.

పైగా, ఈ భోజనము తగిన కాలంలోనే చేయాలి. ఆది క్రైస్తవులు ప్రభురాత్రి భోజనాన్ని వారంలో తొలి దినాన భుజించారు (అపొ. 20:7). అందువలన, ఆ దినాన దాన్ని భుజించడానికిగాను మనకు క్రొత్త నిబంధన మాదిరి ఉంది. వారంలో ఆ దినానే ప్రభువు మృతులలోనుండి లేపబడ్డాడు. ఆ విధంగా దేవుడు అటు ఆ దినాన్ని, యిటు జ్ఞాపకార్థపు విందును జతచేశాడు. దేవుడు దేనిని జతచేశాడో నరుడు దానిని విడదీయకూడదు. సత్యముతో లేక సత్యమునసరించి, ప్రభురాత్రి భోజనాన్ని "మంచి శుక్రవారం"న చేయకూడదు, లేదా మొదటి దినాన తీసి మరి యింకా ఏ దినమున అయినా చేయకూడదు. "ప్రభురాత్రి భోజనం లేని ప్రభువు దినము సువాసనలేని గులాబివలెను, తీపిదనమంతటిని ఎత్తివేసిన తేనెపట్టువలెను ఉంటుంది" అని చెప్పబడింది.

ప్రభురాత్రి భోజనాన్ని అంగీకారయోగ్యంగా చేయగోరినవాడు, దానిని ఎడతెగక చేయువాడైయుండాలి. అది ఎంత తరచుగా చేయబడాలి? "ఆదివారమున" (వారంలోని తొలి దినాన) అని వ్యక్తపరచడంలో వారానికొకసారి ఆచరించవలసిందిగా విధింపబడింది. "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" అని పాత నిబంధనలో ఒక ఆజ్ఞ ఉన్నట్టు మనం చూస్తాం (నిర్గమ. 20:8). "ప్రతి విశ్రాంతి దినము" అని అక్కడ చెప్పబడలేదు, కాని దాని అర్థం అదే! "ఆదివారమున" అనేది వారపు ఆచరణగా సూచింపబడలేదా?

మనుష్యుడు ఒక దానికి బదులు మరొకటిని ఉంచాలని (ప్రత్యామ్నాయం) మొగ్గు చూపుతునే ఉన్నాడు. నాదాబు అబీహులను గుర్తు చేసికో (లేవీ. 10), వారు అన్యాగ్నిని తెచ్చినందున వారి ఆరాధన దేవునికి అంగీకారంగా ఉండలేదు కదా? ముందు ఆజ్ఞాపించిన దానికి బదులు మరొక దానిని నయమాను చేయగోరి కడకు విధేయుడై స్వస్థతను పొందాడు (2 రాజులు 5). సత్యం యొక్క స్థానంలో మనుష్యుల పద్ధతులను లేక సిద్ధాంతములను చేర్చి, పరిసయ్యులు దేవునికి యిష్టులుగా ఉండలేకపోయారు (మత్తయి 15:9).

ఒక దానికి బదులు వేరొకటి చేర్చే పరిధిలో ప్రభురాత్రి భోజనం చాలా దుర్వినియోగం చేయబడింది. రొట్టె, ద్రాక్షారసములకు బదులు కొందరు వేరేవాటిని తెచ్చిపెట్టారు! ఈ గురుతులు దైవికమైన అధికారంతో బల్లమీద పెట్టబడ్డాయి గనుక వాటిని మార్పు చేయకూడదు. కొందరు దినాన్ని మార్పు చేశారు: వారంలో మొదటి దినాన కాకుండ ఆ భోజనాన్ని వేరే దినంలో చేస్తున్నారు. వారానికి ఒకసారి చేసేదానికి బదులు ప్రభురాత్రి భోజనాన్ని కొందరు సంవత్సరానికి, ఆరు నెలలకు, మూడు మాసాలకు జ్ఞాపకార్థంగా చేయబూనారు. తక్కిన సంగతులలో ఎలాగో ప్రభురాత్రి భోజనం విషయం కూడా అలాగే:

వేరే వాటిని చేర్చడం, ఉన్నవాటిని తుంచడం, చెడగొట్టడం జరుగుతునే ఉంది. ఆ విందును "సత్యంతో" జరిగించాలి. లేనివాటిని తెచ్చి పెట్టినప్పుడు ఆరాధనలో సత్యం తొలిగిపోతుంది.

## ఆత్మతో

ఈ పవిత్రమైన విందును చేసే క్రీస్తు సంఘానికి మొదటి కొరింథీ. 11 వ్రాయబడింది. తప్పు దినాన వారు భోజనం చేయడం లేదు సరిగదా, వారానికి జరిగించేదానికి బదులు ప్రత్యేకమైన జ్ఞాపకార్థ సందర్భాలలో వారు దానిని ఆచరించినవారు కారు. అయితే, ఆ రాత్రి భోజనం యొక్క అంతరార్థాన్ని వారు కోల్పోయారు. కొరింథీయులకు వ్రాసిన తన ఉత్తరంలో దాన్ని ఆచరించే క్రమమైన విధానాన్ని పౌలు చూపాడు.

స్వపరీక్ష అవసరమని అతడు తెలియజేశాడు (28 వ.). ఇతరులను మనం విమర్శించ కూడదు కాని, మనలను మనమే పరీక్షించుకోవాలి. **ప్రభురాత్రి భోజనం అంతరంగంవైపు చూపుతుంది.**

ప్రభురాత్రి భోజనం చేసే విధానంలో జాగ్రత్తగా ఉండమని పౌలు కొరింథీయులను – మనలను హెచ్చరించాడు, ఎందుకంటే, దాన్ని తగినట్టుగా భుజించడంలో ప్రభువు మరణం ప్రచురింపబడుతుంది (26, 27 వచనాలు). భుజించుట ద్వారా మనం ప్రకటిస్తాం. "అయోగ్యంగా" తగని విధంగా దాని భుజింపకుండునట్లు జాగ్రత్తపడదాం. దైవ భయముతోను, మర్యాదగాను దాని జరిగించుదాం. అనాలోచనగా పాలుపంచుకునే వాళ్ళ విధానం విసుగు పుట్టించేలా ఉంటుంది. **ప్రభురాత్రి భోజనం వెలుపలకు చూపుతుంది.**

ప్రభువు స్థాపించిన ఈ జ్ఞాపకార్థపు విందు మన మనస్సులను పూర్వపు సంఘటనల దగ్గరకు నడిపిస్తుంది. "నన్ను జ్ఞాపకం చేసికొనుటకు" (25 వ.). కల్వరి విపత్తునొద్దకు మన మనస్సులు వెళ్లాలి. గతించిన శతాబ్దాలగుండా క్రైస్తవుని విశ్వాసపు దృష్టి పయనించాలి. మన పాపములకొరకు చనిపోతున్న క్రీస్తును అది వీక్షిస్తుంది; **ప్రభురాత్రి భోజనము గతమును చూపుతుంది.**

ఆ రొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల "ప్రభువు వచ్చువరకు" ఆయన మరణమును ప్రచురపరచుదురని పౌలు అన్నాడు (26 వ.). ప్రభురాత్రి భోజనంలో పాలుపొందుట ద్వారా క్రైస్తవుడు క్రీస్తు రెండవ రాకడయందు తన విశ్వాసాన్ని ప్రచురం చేస్తూ ఉంటాడు. "ఆయన వచ్చేవరకు" ఈ పని జరిగిస్తునే ఉండాలి. ప్రతివారం ప్రభువు భోజనపు బల్లను ఉంచే సంఘముయొక్క బాధ్యతనుండి దానిని తొలగించే ఒకే సంఘటన ప్రభువు యొక్క రాకడ అని చెప్పబడింది! **ప్రభురాత్రి భోజనం జరుగనున్న దానిని చూపుతుంది.**

## ముగింపు

ప్రభురాత్రి భోజనాన్ని తగిన విధముగా ఆచరించని కారణాన కొరింథీలోని క్రైస్తవులలో అనేకులు బలహీనులును రోగులునైయున్నారు. నిస్సందేహంగా, నేడు కూడా క్రీస్తు శరీరంలోని అనేకమంది సభ్యులు అదే కారణాన్నిబట్టి ఆత్మ సంబంధంగా బాధపడు తున్నారు, గనుక, ఆత్మతోను సత్యముతోను ప్రభురాత్రి భోజనాన్ని ఆచరించడానికి జాగ్రత్తపడదాం.